ప్రజాశక్తి
గురువారం 13 జూన్ 2024 5 శ్రీ సత్యసాయి

ఉచిత ఆటో నడుపుతున్న చిన్న కుళ్లాయప్ప

చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా

అభిమాని ఉచిత ఆటో సేవలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నాలుగవసారి ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో ఓ ఆటో కార్మికుడు బుధవారం ఉచితంగా ఆటో నడిపి తన అభిమానం చాటుకున్నాడు. పుట్టపర్తికి చెందిన ఆటోవాలా చిన్న కుళ్లాయప్ప బుధవారం పుట్టపర్తి బస్టాండులో చార్జీలు ఉండవని బోర్డు రాయించుని ఉచితంగా మామిళ్ల కుంట క్రాస్ లో ఉన్న సత్యసాయి రైల్వే స్టేషన్‌కు ఆటో నడిపాడు. ప్రయాణికులను స్వయంగా పిలిచి ఆటోలో ఎక్కించుకొని రైల్వే స్టేషన్‌కు రోజంతా నడిపాడు .ఈ సందర్భంగా చిన్న కుళ్లాయప్ప మాట్లాడుతూ ఈ ఐదేళ్లు రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందన్నారు .తిరిగి రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. పుట్టపర్తిలో టిడిపి అభ్యర్థి గెలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి గద్దె నెక్కాలన్న తన కోరిక తీరిందన్నారు. చంద్రబాబుపై అభిమానంతో తాను బుధవారం రోజంతా ప్రయాణికులకు ఉచితంగా తీసుకెళ్లానని చెప్పారు.

ఇబ్బందుల వెంబడి

రెండు నెలల విరామం తర్వాత పాఠశాలు పున:ప్రారంభం కానున్నాయి. గురువారం నాడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి బడి బాట పట్టనున్నారు. రెండు నెలలుగా మూగబోయిన పాఠశాలలు నేటి నుంచి సందడి కన్పించనుంది. 2023-24 కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యాశాఖ అధికారులు విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానిస్తున్నారు.

- ◆ నేటి నుంచి మోగనున్న బడిగంట
- ◆ సెలవులకు టాటా.. బడి బాట..!
- ◆ పలు పాఠశాలల్లో సమస్యలు స్వాగతం
- ◆ కొత్త ప్రభుత్వంపై ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం,హిందూపురం, కదిరి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని పాఠశాలల పున:ప్రారంభానికి ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పాఠశాలల తరగతి గదులనూ సిద్ధం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఓటింగ్ కోసం అధికారులు ఉపయోగించుకున్నారు. పోలింగ్ కోసం ఉపయోగించుకున్న తరగతి గదులను విద్యార్థులకు అనుగుణంగా అధికారులు సిద్ధం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలలకు పంపే ఏర్పాట్లలో నిమగ్నం అయ్యాయి. గడిచిన ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనులు జరిపినా ఇంకా చాలా పాఠశాలల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సమస్య తదితర మౌలిక వసతుల కల్పన పూర్తి స్థాయిలో జరగలేదు. పట్టణ ప్రాంత పాఠశాలల్లో పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో సమస్యలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 5200 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 3850, ప్రయివేటు పాఠశాలలు 1350 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో 3.60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. నేడు పాఠశాలలు తెరవనుండడంతో వీరంతా బడులకు వెళ్లనున్నారు.

అసంపూర్ణంగా నాడు-నేడు పనులు ..!

ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్న నినాదంతో గత వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు పనులను ప్రారంభించింది. వీటి ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా మూడు విడతలుగా ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేశారు. నిధుల లేమి, ఇతరత్రా సమస్యలతో నాడు-నేడు పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో శిథిల తరగతి గదులు నేటికీ దర్శనమిస్తున్నాయి. పురపాలక కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో ఒకింత ఈ పనులు జరిగినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ వేగం కన్పించలేదు. ఈ ఏడాది కూడా పాత తరగతి గదిల్లోనే పాఠాలు బోధించే పరిస్థితి చాలా పాఠశాలల్లో కన్పిస్తోంది. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి ఉంది. మరుగుదొడ్లు ఉన్న పాఠశాలల్లో నీటి సమస్య కారణంగా వాటిని ఉపయోగించే స్థితి లేదు. దీంతో పిల్లలు ఆరు బయటకు వెళ్లక తప్పని దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంత పాఠశాలలకు ప్రహరీలు లేవు.

కదిరిలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు,

గందరగోళంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు

ప్రభుత్వం మారడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణ గందరగోళంగా మారింది. గత ఐదేళ్లుగా వైసిపి నాయకుల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ జరుగుతుండేది. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీల బాధ్యతలను తెలుగుదేశం మద్దతుదారులు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల ఈ వ్యవహారంపై ఘర్షణలు జరుగుతున్నాయి. నేడు పాఠశాలల ప్రారంభం సందర్భంగా పాతవారితోనే మధ్యాహ్న భోజనం చేయించాలా.. లేక ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నేతలు సిఫార్సు చేసిన వారితో మధ్యాహ్న భోజనం తయారు చేయించాలన్న అన్న సందిగ్ధంలో ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

విద్యాకానుక పంపిణీలో జాప్యం

ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు విద్యా కానుక కింద పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం తదితర వాటిని ప్రభుత్వం అందిస్తుంది. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం కొలువదీరింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఇంకా రెండు రోజులు మాత్రమే అయ్యింది. ఈనేపథ్యంలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందించడంలో జాప్యం జరిగే అవకాశం కన్పిస్తోంది. ఆయా ప్రాంతాల్లో విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని వీటిని పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పుస్తకాలు పాఠశాలలకు చేరాయని, వీలైనంత త్వరగా వీటిని విద్యార్థులకు అందిస్తామని విద్యాశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. విద్యాకానుక కిట్లు ఏ మేరకు పాఠశాలలకు చేరాయన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ఉంది. మొత్తం విద్యార్థులకు ఒకే సారి ఇస్తారా.? లేక గతం మాదిరిగానే కొద్దిమంది విద్యార్థులకు అందజేసి, తరువాత ఇంకొందరికి ఇస్తామని చెబుతారా అన్న అన్నది తెలియాల్సి ఉంది. .

ప్రయివేటు ఫీజుల మోత

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది. వివిధ సిలబస్‌ల పేరుతో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థి కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కెజిలో చేర్పించాలంటే పుస్తకాలు, యూనిఫాం, పాఠశాల ఫీజు కలిపి దాదాపు రూ.20 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక 5 నుంచి 10 వరకు చదివే విద్యార్థులు ఉంటే లక్షల్లోనే ఫీజుల భారం తల్లిదండ్రులపై పడుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజుల నియంత్రణ ఉండాల్సి ఉన్నా, అది ఆచరణలో కన్పించడం లేదు. దీనికి తోడు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో వారి వద్దనే పుస్తకాలు, యూనిఫాం కొనాలన్న నిబంధనతో వాటి మీద కూడా అదనంగా బాదేస్తున్నారు.

మురుగుకాలువపై అక్రమ నిర్మాణం

'పురం'లో ఆక్రమణల జోరు

ఇబ్బంది పడుతున్న వాహనాదారులు, పాదచారులు

ప్రజాశక్తి-హిందూపురం

వంద సంవత్సరాల పైబడి చరిత్ర కలిగిన హిందూపురం పురపాలక సంఘంలో ఆక్రమణ జోరు కొనసాగుతోంది. హిందూపురం పురపాలికలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు వైస్ చైర్మేన్లు, 26 మంది మంది వైసిపి కౌన్సిలర్లు, ఆరుగురు టిడిపి, ఒక బిజెపి, ఒక ఎంఐఎంకౌన్సిలర్లు ఉన్నారు. వీరితో పాటు మున్సిపల్ యంత్రాంగంతో పాటు సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు మురుగు కాలువలను సైతం వదలకుండా స్వార్థపరులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేసుకున్నప్పటికి ఇందులో ఏ ఒక్కరు కూడా తమకేందుకు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పెనుకొండ ప్రధాన రహదారి, ఇందిరమ్మ సర్కిల్ వద్ద ఉన్న మురుగు కాలువలు నిండి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఆక్రమణల మూలంగా వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఏ రోజు కూడా పాలక వర్గం కానీ...ప్రతి పక్ష కౌన్సిలర్లు కాని మున్సిపల్ మీట్‌లో అధ్యక్షా ఇది సమస్య అని నోరు మెదపకపోవటం విడ్డూరం.

హిందూపురం పురపాలక సంఘంలో నిలువ నీడ లేని నిరుపేదలు వారి తాత ముత్తాల నుంచి సంక్రమించిన చిన్న చిన్న ఇళ్లల్లో స్థలం చాలక మురుగు కాలువలపై చిన్నచిన్న నిర్మాణాలు చేసుకున్నారు. వీటిని ఆక్రమణల పేరుతో మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి, జెసిబిలతో వారి అక్రమ నిర్మాణాలను కూలగొట్టారు. అనంతరం ఆయా ఆక్రమణల తొలగింపు ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలి వేశారు. అయితే జన సముదాయాలు ఎక్కువగా ఉండే ప్రధాన రహదారుల్లో వాణిజ్య సముదాయ భవనదారులు పురపాలిక మురికి కాలువలను, రోడ్లను ఆక్రమించుకుని నిర్మాణాలు చేసుకున్నా వాటి వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. తమకు ఎందుకు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పాలకులు సైతం అధ్యక్షా ఇది న్యాయమా..? అని మున్సిపల్ మీట్‌లో ప్రశ్నించడం లేదు. దీని వెనుక దాగి ఉన్న మర్మమేమిటో పాలకులకు, పాలకుల పిఎలకే తెలియాలి. నిత్యం రద్దీగా ఉండే ఇందిరమ్మ సర్కిల్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. ఇది అద్దెకు తీసుకున్న వారు మురుగు కాలువతో పాటు రోడ్డును సైతం ఆక్రమించుకున్నారు. దీని పక్కనే మారుతీ షాపింగ్ కాంప్లెక్స్, నూతనంగా నిర్మాణం చేసుకున్న బేకరి షాప్ వారు కాలువలు, రోడ్డును ఆక్రమించుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే బెంగళూరు రోడ్డు, పెనుకొండ రోడ్డు, ఆర్‌పిజిటి రోడ్డులో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నప్పటికి మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ సర్కిల్‌లో మురుగు కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేసుకోవడంతో కాలువలో పూడిక పూడుకు పోవడంతో మురుగు నీరు మొత్తం రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఆ మురుగు నీటిలో వాహనాలు వెళుతున్నాయి. ఆసమయంలో అటు వైపుగా వెళ్లే పాదచారులపై ఆ మురుగు నీరు పడుతోంది. మున్సిపాలిటీలో ఆక్రమణలు జోరుగా కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇందిరమ్మ సర్కిల్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించి, మురుగు నీరు రోడ్డుపై రాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైసిపి పట్టణ కన్వీనర్ రాజీనామా

ప్రజాశక్తి - మడకశిర

వైసిపి పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తాను బుధవారం తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పట్టణంలో తెలుగుదేశం పార్టీకి అధిక ఓట్లు రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ వైసిపికి రాజీనామా చేసినట్లు ఆయన చెప్పారు.

పుట్టకామప్ప

బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే చర్యలు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

చిన్న వయస్సు వారితో పనిచేయించుకున్నా, బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీలత హెచ్చరించారు. రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ రైట్స్ అడ్వాకసి ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహించనున్న బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను డీఎస్పీ శ్రీలత బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చదువు కోవాల్సిన వయసులో బాలలతో పనిచేయించడం నేరమన్నారు. ఎవరైనా అలా పని చేయిస్తే వారి పైన చర్యలు తీసుకుంటామన్నారు. రెడ్స్ కోఆర్డినేటర్ ఎల్లప్ప మాట్లాడుతూ పలక బలపం పట్టవలసిన చేతులతో పని చేయించడం నేరమన్నారు.కార్మిక వ్యవస్థను నిర్మూలించడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమం లో రెడ్స్ సిబ్బంది శారద, మీనా కుమారి, శేషాద్రి, అనిత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు : ఎంఇఓ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని లేని పక్షంతో చర్యలు తప్పవని ఎంఇఓ ఓబుల్ రెడ్డి హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ, మండల పరిధిలో 99 ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరికీ పాఠ్యపుస్తకాలు, పుస్తకాలతో పాటు వర్క్ బుక్, యూనిఫామ్, బూట్లు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు.

రాష్ట్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న పయ్యావుల కేశవ్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్

మంత్రివర్గంలో ముగ్గురు..!

పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ ప్రమాణస్వీకారం

◆ముగ్గురికి తొలిసారి అమాత్య యోగం ◆తొలి విజయంతోనే సవితమ్మ, సత్యకుమార్‌కు ఛాన్స్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకేసారి ముగ్గురికి మంత్రివర్గంలోకి చోటు లభించింది. ముగ్గురూ తొలిసారిగా మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు అనంతపురం జిల్లా నుంచి చోటు లభించగా, సత్యసాయి జిల్లా నుంచి ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్, పెనుకొండ ఎమ్మెల్యే సవితకు మంత్రివర్గంలో స్థానం లభించింది. ఇప్పుడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న ముగ్గురు కూడా తొలిసారిగా మంత్రులయ్యారు. ఇందులో పయ్యావుల కేశవ్ అనేకమార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఉండగా, సత్యకుమార్, సవితలు తొలిసారిగా ఎమ్మెల్యే అయి ఒకేసారిమంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

మూడు దశాబ్దాల నిరీక్షణ తరువాత మంత్రి

మంత్రి వర్గంలో తొలిసారిగా చోటు దక్కించుకున్న పయ్యావుల కేశవ్ 1994లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. ఆ తరువాత 2004, 2009, 2019లో, 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఎమ్మెల్యే అయిన ప్రతిసారీ పార్టీ అధికారంలో లేదు. దీంతో మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ఈసారి రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతోపాటు, ఎమ్మెల్యేగా కేశవ్ గెలవడంతో మంత్రివర్గంలోకి చోటు దక్కింది.

తొలిసారి ఎమ్మెల్యేతోనే మంత్రివర్గంలోకి..

పెనుకొండ ఎమ్మెల్యేగా సవితమ్మ తొలిసారిగా పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. సవితమ్మకు రాజకీయ కుటుంబ నేపథ్యం ఉంది. ఆమె తండ్రి రామచంద్రారెడ్డి మాజీ మంత్రిగానూ, ఎంపిగానూ పనిచేశారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక కురుబ కార్పొరేషన్ ఛైర్మన్‌గానూ పనిచేశారు. బిసి మహిళ కోటాలో ఆమెకు ఈ పదవి దక్కింది.

అనూహ్యంగా టిక్కెట్టు సాధించి మంత్రి పదవి

అనంతపురం జిల్లాతో అంత పెద్దగా అనుబంధం లేని సత్యకుమార్ అనూహ్యంగా ధర్మవరం అసెంబ్లీ టిక్కెట్టును బిజెపి తరుపున దక్కించుకున్నారు. అదే విధంగా విజయం కూడా ఊహించని విధంగా దక్కింది. ఇప్పుడు మంత్రి పదవి కూడా అదే రకంగా దక్కడం గమనార్హం. బిజెపిలో అనేక మంది సీనియర్లు గెలుపొందిన వారిలో ఉన్నా సత్యకుమార్‌కు ఈ పదవి దక్కడం చర్చనీయాంశం అయ్యింది.

సీనియర్లకు నిరాశ

ఈసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారిలో అనేక మంది సీనియర్లు ఉన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు గతంలో మంత్రిగా పనిచేశారు. ఆయన ఈసారి రాయదుర్గంలో గెలుపొందారు. మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. కాని తొలి మంత్రివర్గం ఏర్పాటులో నిరాశే మిగిలింది. మాజీ మంత్రి పరిటాల సునీతది అదే పరిస్థితి. మంత్రి పదవి ఈసారి వస్తుందని భావించారు. కాని సత్యసాయి జిల్లాలో సత్యకుమార్, సవితమ్మకు ఇవ్వడంతో వీరికి నిరాశ తప్పలేదు. వైసిపి నుంచి టిడిపిలో చేరి గుంతకల్లులో పోటీ చేసిన జయరాంకు నిరాశే మిగిలింది.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

సచివాల వ్యవస్థ బలోపేతంతో పాటు సచివాలయంలో ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా అసోసియేషన్ ముందుకెళుతోందని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భీమిరెడ్డి సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులోని ఓ హాల్లో జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భీమిరెడ్డి సంజీవరెడ్డి మాట్లాడుతు ప్రభుత్వం మారిన నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులలో నెలకొన్న అనేక అనుమానాలను నివృత్తి చేశారు. గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఉద్యోగం పొందిన రెండు సంవత్సరాలలో శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన ప్రభుత్వం తొమ్మిది నెలలు ఆలస్యంగా, అది కూడా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో శాశ్వత ఉద్యోగులుగా గుర్తించిందని చెప్పారు. సచివాలయ ఉద్యోగిపై వివిధ శాఖల అధికారుల అజమాయిషి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, సచివాలయ నిర్వహణ ఖర్చులు ఉద్యోగులపైనే వేయడం లాంటివి జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కాకర్ల వెంకటరామిరెడ్డి లాంటి భజన పరులు సమస్యలను పరిష్కరించకుండా అసోసియేషన్‌ను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేశారని విమర్శించారు. ఈ విషయాలన్నింటినీ ఇప్పటికే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అధ్యయనం చేశారన్నారు. ఇప్పటికే సమస్యలన్నింటినీ ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరామని చెప్పారు. కొంతమంది సచివాలయ వ్యవస్థ పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని సూచించారు. మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ రెడ్డి, హిందూపురం అర్బన్ అధ్యక్షులు హరినాథ్, కవిత, స్టేట్ జాయింట్ సెక్రటరీలు శ్రీనివాసులు, హర్ష వర్ధన్, జిల్లా జాయింట్ సెక్రటరీ బాబు, ఆశ్వర్థప్ప, హిందూపూర్ అర్బన్ కమిటీ సభ్యులు శరణ్, గొల్ల రమేష్, శ్రీకాంత్, చందు, బాబా ఫక్రుద్దీన్, ధీరజ్, ప్రవీణ్, బండారు సురేష్, ప్రభాకర్, లలిత్, జీవన్, శంకర్, చైతన్య, ఉపేంద్ర, జయచంద్ర రెడ్డి, నరేష్ రెడ్డి, మహేష్, సోమశేఖర్, గిరీష్, పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు భీమిరెడ్డి సంజీవరెడ్డి

మంత్రితో గోరంట్ల టిడిపి నాయకులు

మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల

పెనుగొండ ఎమ్మెల్యే సవితమ్మ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా విజయవాడలో గోరంట్ల టిడిపి నాయకులు మంత్రిని బుధవారం కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు వేణు రాయల్, జయరాం, అశ్వత్ రెడ్డి, బొబ్బిలి రామ్మోహన్, పసుపులేటి శ్రీనివాసులు, మల్లికార్జున, శ్రీనివాసులు, నంజుండప్ప, శ్రీనివాసులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి బత్తలపల్లి

వేరుశనగ విత్తేముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని ఎఒ ఓబిరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వేరుశనగ విత్తనం వేస్తున్న రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఒక కేజీ విత్తనానికి క్లోరోపైరిఫాస్ 6 ఎంఎల్, కాన్ఫిడార్ ఒక ఎంఎల్ కలపాలని సూచించారు. తద్వారా వేరుకుళ్ల తెగులు, కాండం కుళ్ల తెగులును నివారించవచ్చన్నారు. ఎకరాకు 50 నుంచి 60 కేజీల విత్తనం సరిపోతుందన్నారు. దుక్కిలో 20 కేజీల యూరియా, 100 కేజీల సూపర్, 50 కేజీల పోటాష్ వేసుకోవాలన్నారు. జింక్ సల్ఫేట్ ఎకరాకు 10 కేజీలు దుక్కిలో వేసుకోవాలన్నారు. జూన్ మొదటి వారం నుంచి జులై 15 వరకు విత్తనం వేసుకోవచ్చునని ఆయన చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - మడకశిర

సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని డిఎంహెచ్ఒ మంజువాణి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నియోజకవర్గ డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం హెచ్ఒ మాట్లాడుతూ విధి నిర్వహణలో అవలంభించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని కదిరేపల్లి, కల్లుమర్రి, నీలకంఠాపురం, గుడిబండ, బోరుబాగుల్, హేమవతి, అమరాపురం, గుండుమల ఆసుపత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

కదిరి మున్సిపాల్టీలో శరవేగంగా ఫైళ్ల కదలిక

ఎంబుక్కును పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ సెక్షన్ అధికారి

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో మూడు నెలలపాటు ఎన్నికల వాతావరణం కొనసాగింది. ఇటీవలే ఎన్నికల క్రతువు ముగిసింది. ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోయి టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం సాధించింది. ఫలితాలు అనంతరం వైసీపీ అధికారం కోల్పోగానే అదే రోజు రాష్ట్ర ఉన్నతాధికారులు అప్రమత్తమై ఈ నెల 15 వరకు ఏ శాఖలోనూ అధికారులు ఫైళ్లపై సంతకాలు చేయడం గాని, కిందిస్థాయి అధికారులకు సెలవులు మంజూరు చేయడం గాని ఆపివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా కూటమి అధికారం తరఫున ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన కందికుంట వెంకటప్రసాద్ సైతం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు మున్సిపాలిటీలో ఇతరత్రా వాటికి సంబంధించి తనకు తెలియకుండా ఎటువంటి పనులు చేయరాదని మున్సిపల్ కమిషనర్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ మున్సిపాలిటీలోని కొందరు అధికారులు ఉన్నతాధికారులు ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. అత్యుత్సాహం ప్రదర్శించి గత ప్రభుత్వ హయాంలో చేసిన

ఉన్నతాధికారుల ఆదేశాల బేఖాతరు

పనులకు సంబంధించి చకచక ఫైళ్లు కదిలించి ఫైళ్లపై సంతకాలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు సిఎఫ్ఎంఎస్ ఇతర లాగిన్లు మొత్తం పనిచేయకుండా చేసినప్పటికీ ఇక్కడి అధికారులు ఆత్రుతగా కాంట్రాక్టర్లను మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి రప్పించుకొని మాన్యువల్‌గా ఫైళ్లపై సంతకాలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ చర్య ఎవరి స్వలాభం కోసమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కదిరి మున్సిపాలిటీలో చోటు చేసుకున్న పరిణామాలపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

ధర్మవరం ప్రజలకు రుణపడి ఉంటా : మంత్రి

ధర్మవరం టౌన్ : తనను మంత్రిస్థాయి వరకు తీసుకువచ్చిన ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్ తన ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించినందుకు తన పార్టీ ప్రముఖులకు, సిఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అతితక్కువ కాలం లోనే అఖండ విజయానికి కారకులైన ధర్మవరం ప్రజలకు రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు.

'సమాచార హక్కు' కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీదేవి టాకీస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఆర్‌టిఐ సమాచార హక్కు ప్రజా సంరక్షణ వేదిక కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గోపి, జిల్లా కోశాధికారి బీరే కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి కొండప్ప మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో నెలకొన్న అవినీతిని అంతమొందించడానికి సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో వజ్రాయుధంగా దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నూర్ మొహమ్మద్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఆయా గ్యాస్ ఏజెన్సీల కార్యాలయంలో తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని జిల్లా గ్యాస్ ఏజెన్సీ అసోసియేట్ పి.వి. రాజీవ్ తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఇకెవైసి చేయించుకున్న వారికి మాత్రమే గ్యాస్ ప్రమాదంలో బీమా వర్తిస్తుందన్నారు. ముఖ్యంగా గ్యాస్ వినియోగదారులు బాడుగ ఇళ్లలో ఉన్నవారు ఇతర ఇళ్లలోకి మారి ఉంటారని, కొందరి ఫోన్ నెంబర్లు కూడా మారి ఉంటాయని అన్నారు. వారి అడ్రస్సుకు సంబంధించి ఇకెవైసిలో సక్రమంగా నమోదు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్‌కు సంబంధించి ఇచ్చే ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్యాస్ పుస్తకం, ఆధార్ కార్డు నకలు, ఫోన్ నెంబర్‌తో ఆయా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల కార్యాలయాలకు వెళితే వేలిముద్రలు వేయించుకొని నమోదు చేస్తారన్నారు. గ్యాస్ పుస్తకం ఎవరి పేరుతో ఉంటుందో వారే ఇకెవైసి నమోదుకు వెళ్లాలన్నారు.

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు

చిలమత్తూరులో పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు తరలింపు

పాఠ్యపుస్తకాలు చూపుతున్న ఎంఇఒ గంగప్ప

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని ఎమ్మార్సీ, జడ్పీ హై స్కూల్ లో నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలను మండలంలోని 75 పాఠశాలకు చేర్చినట్లు మండల విద్యాశాఖ అధికారి పద్మప్రియ తెలిపారు. మండల వ్యాప్తంగా 25,500 నోట్ పుస్తకాలు, 12,500 పాఠ్య పుస్తకాలు,2763 బెల్ట్‌లు వచ్చాయని చెప్పారు. పాఠశాలలు గురువారం ప్రారంభం అవుతున్న తరుణంలో వీటిని పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. అయితే 2వ విడతలో మరిన్ని పాఠ్య పుస్తకాలు రావల్సి ఉందని అవి రాగానే ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు.

హిందూపురం : 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అవసరమైన (స్టూడెంట్ కిట్స్) బెల్టు, బూట్లు, నోట్ పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలు, డ్రెస్ మెటీరియల్‌ను ఆయా పాఠశాలలకు సకాలంలో అందిస్తామని ఎంఇఒ గంగప్ప తెలిపారు. స్థానిక ఎంజిఎం పాఠశాలలో భద్ర పరచిన స్టూడెంట్ కిట్స్‌ను పట్టణంలోని వివిధ పాఠశాలలకు ప్రత్యేక వాహనంలో సరఫరా చేసే కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి పాఠశాలలు పున: ప్రారంభం అవుతున్నాయని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను చిరునవ్వుతో ఆహ్వానం పలకాలన్నారు. ఇప్పటికే పాఠశాలల పరిశుభ్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మధ్యాహ్నం భోజనం, వాతావరణ పరిస్థితుల్లో సమస్యలు తలెత్తకుండా అందరి పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇక విద్యార్థుల కిట్లను అన్ని పాఠశాలలకు అందిస్తామని, వాటిని విద్యార్థులకు అందించి, ఈ విద్యా సంవత్సరం మంచి ఫలితాలను తీసుకు రావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రసన్నలక్ష్మి, సిఆర్‌ఎంటిలు పిటిఐలు, ఎంఐఎస్ నందిని, తౌసిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని మల్ల మీద పల్లి రోడ్డు వద్ద బుధవారం ఫ్లెక్సీ కడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురై ముగ్గురు గాయపడ్డారు. ఫ్లెక్సీ కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో బాబు, శ్రీనివాసులు, మేకల నారాయణ గాయపడ్డారు. వీరిని ప్రైవేటు వాహనంలో కదిరికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన నారాయణను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలో ఆస్తి పన్ను వసూలులో సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో బుధవారం సమావేశం నిర్వహించారు. పన్ను వసూలులో తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు అందజేశారు. ఈనెల 30వ తేదీలోగా 2024 - 25 సంవత్సరపు ఆస్తి పన్నును వసూలు చేయాలన్నారు. పన్ను పూర్తి మొత్తంలో చెల్లిస్తే రెండు శాతం రాయితీ ఉంటుందని, ఈ విషయాన్ని పన్ను కట్టే వారికి తెలియజేయాలని తెలిపారు. నెలాఖరులోపు అనుకున్న టార్గెట్‌ను ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఆర్వో తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - కొత్తచెరువు

నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న కార్పొరేటు ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ మేరకు వారు బుధవారం స్థానిక డిఇఒ కార్యాలయంలో డీఈవో మీనాక్షికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు ప్రయివేటు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. వ్యాపారమే ధ్యేయంగా పలు ప్రయివేటు విద్యాసంస్థలు కొనసాగుతున్నాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, పవన్, నవీన్, సురేంద్ర, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వి ప్రసాద్ కంటిఆసుపత్రి వార్షికోత్సవం

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలోని ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి రెండవ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కంటికి సంబంధించిన అన్ని శస్త్ర చికిత్సలు ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తున్నామన్నారు. తమ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి పరిపాలనధికారి కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ, రఫిక్, ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి మంత్రి కృతజ్ఞతలు

ప్రజాశక్తి -పెనుకొండ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మంత్రి సవితమ్మ కుటుంబసభ్యులు బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి సవితమ్మ కుటుంబసభ్యులు చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవితమ్మ, భర్త వెంకటేశ్వరరావు, కుమారుడు జగదీష్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుతో మంత్రి సవితమ్మ కుటుంబసభ్యులు

కూటమి నాయకుల సంబరాలు

ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సంబరాల్లో కదిరి నాయకులు

ధర్మవరంలో బాణాసంచా కాల్చుతున్న మాంగళ్యస్కిల్స్ జింకాబ్రదర్స్

ప్రజాశక్తి -పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు తో పాటు నూతనంగా ఎన్నికైన మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలో టిడిపి శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటాయి. బుధవారం హనుమాన్ సర్కిల్‌లో ఎల్ఈడి తెరపై ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వందలాదిమంది తిలకించారు. 100 మీటర్ల పొడుగునా బాణసంచా కాల్చి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి : నారా చంద్రబాబు ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకొన్నారు. కూటమి నాయకులు స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రవి, నరసింహ రెడ్డి, మారేష్, తిప్పారెడ్డి, రామాంజినప్ప, జయరామప్ప, ఆదినారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించడానికి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి అధికసంఖ్యలో టీడీపీ శ్రేణులు, ప్రజలుతరలివచ్చారు. ఉదయం నుంచి క్రీడామైదానమంతా పసుపుమయంగా మారింది. ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్.నరేంద్రచౌదరి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు బైకు ర్యాలీ నిర్వహిస్తూ క్రీడామైదానానికి చేరుకున్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా, సత్యకుమార్యాదవ్ రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో కేరింతలు వేస్తూ బాణా సంచాలు కాల్చుతూ చేసిన సంబరాలు చేసుకున్నారు.

పెనుకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం రాష్ట్ర మంత్రి ఎస్.సవితమ్మ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలో ఎన్‌టిఆర్ అన్నా క్యాంటీన్‌ను పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ సవితమ్మ ఆధ్వర్యంలో గత ఏడాది గా పెనుకొండ నియోజకవర్గంలో అన్నా క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం తిరిగి అన్నా క్యాంటీన్‌ను కొనసాగిస్తున్నామన్నారు. అదేవిధంగా సవితమ్మ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఎన్టీఆర్ విగ్రహానికి కూటమి నాయకుల పూలమాలలు వేసి సంబరాలు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా గోరంట్ల పట్టణంలో టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారుపార్టీ మైనార్టీ యువ నాయకుడు ఉమర్ ఖాన్ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవా, నరసింహులు, అజమతుల్లా, మల్లాపల్లి, ఫిరోజ్‌బాషా, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచి పెద్ద ఎత్తున టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రైతు సంఘ నాయకుడు హరికృష్ణ, లక్ష్మన్న, టీడీ బాబా, అనసూయమ్మ, కోతుల ప్రసాద్, మహేంద్ర, జెసిబి ప్రభాకర్, గోవింద్, గంగాధర్, శ్రీనివాసులు, రామంజి, నిమ్మకాయల రామంజి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్‌యాదవ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలోని బుధవారం నేసేపేటలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాంగళ్యస్కిల్స్ ఆధ్వర్యంలో జింకా బ్రదర్స్ జింకానాగభూషణ, జింకాగిరి, జింకా పురుషోత్తం కేక్ కట్ చేసి, బాణాసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా చేనేతసెల్ రాష్ట్ర సభ్యుడు గుండా పుల్లయ్య, జిల్లా కార్యవర్గసభ్యుడు పుట్లూరు నరసింహులు, చేనేత ప్రముఖులు తీరంపురం ప్రసాద్, మెటికలకుళ్లాయప్ప దత్తాత్రేయ, శివ,రామాంజినేయులు,శీలంరాజు, పురందర దాసు, మేకల కుమార్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

కదిరి అర్బన్ :. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడుకు వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు బంగారు కృష్ణమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్థానిక అన్న క్యాంటీన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.. ఈ నేపథ్యంలోనే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కొత్త చెరువులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాణసంచా పేల్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వాణి, మాజీ జెడ్పిటిసి లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు నాగేంద్ర ప్రసాద్, శివ, వంశీ కిషోర్, ఆలకుంట శ్రీనివాసులు, కిరణ్, రాహుల్, రమేష్ ,నాగేంద్ర ,లోచర్ల పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. రెక్కమానులో కుర మామిడి సర్పంచ్ సిఎన్ఎ సుధాకర్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్, బాలకృష్ణ, కందికుంట వెంకటప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, స్థానిక ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు డిష్‌రాజు పట్టణంలోని 13వ వార్డులో వందమంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రాప్తాటి రాము, మైనారిటీ మోర్చా పట్టణ కార్యదర్శి నూర్‌బాషా, రషీద్ ఖాన్, బండ్లపల్లి రాజు, సిద్ధయ్యగుట్ట హరి, నిరంజన్ కుమార్ యాదవ్, బాషా, తలారి గణేష్, 13వ వార్డు మహిళలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ :సిఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బీసీ సంఘం అధ్యక్షుడు ఖాదర్ బాదర్ నాగప్ప, ఏనుగుల రమణ, శేషు తదితరుల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతన్న రాజ్యం ఏర్పడిందన్నారు. మరో కార్యక్రమంలో జనసైనికులు కుటాల లక్ష్మణ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మణ కుటాల , నియోజకవర్గం ఐటి వింగ్ కోఆర్డినేటర్ పొరకాల రాజేంద్ర ప్రసాద్ , కార్యదర్శి ఇనోద్దిన్ , చక్రధర్ బాబు, అజయ్ , ఇర్ఫాన్ , అక్బర్ , నరేష్ , గణేష్ ,రూపేష్ , కలాం,చక్రి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : చంద్రబాబు నాయుడు సిఎంగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టిడిపి స్థానిక నాయకులు మండలంలో సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పరిగి : పరిగి మండల కేంద్రంలో బుధవారం టిడిపి మండల శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. టిడిపి పెనుగొండ ఎమ్మెల్యే సవితమ్మ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో టిడిపి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.బీరలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సప్పలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. సేవామందిర్‌లోని ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు బ్రెడ్ పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల నాయకులు డిఎస్ఎల్ శ్రీనివాసులు, నరసింహులు, లక్ష్మణరావు, గురుస్వామి నరసింహులు, చౌడప్ప, వడ్డెర శ్రీనివాసులు, మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కూటమి నాయకులు అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన సందర్భంగా బుధవారం ముదిగుబ్బలో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి కదిరి రోడ్డు పెట్రోల్ బంక్ వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పసుపు నీటితో శుద్ధి చేసి, పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ అధ్యక్షుడు మోపూరి ఆశిష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సోమల వినోద్, కోట్ల బాబి, చరణ్, వెంకటేష్, గడ్డం ఓబిరెడ్డి, జయప్ప, రాము, అమీర్, షరీఫ్, షబ్బీర్‌తో పాటు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలో టిడిపి నేతలు సంబరాలు జరుపుకున్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. అనంతరం బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అదే విధంగా వివిధ వార్డుల్లో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ అసుపత్రిలో జరిగిన అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రావు. పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అనిల్ కమార్, ఆర్ఎంఎస్ షఫివుల్లా, నాయకులు శేఖర్, ఆనంద్, జెపి రాము, చంద్రమోహన్, అజ్మతుల్లా, మంగేష్, సతీష్ కుమార్ పెద్ద ఎత్తున టిడిపి నాయకులు పాల్గొన్నారు. మంత్రిగా కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జనసేన నాయకులు నిమ్మకాయల రాము ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఈ వెంకట స్వామి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న పరిగి నాయకులు

పెనుకొండలో భోజనం వడ్డిస్తున్న టిడిపి నాయకులు

అన్నదానం చేస్తున్న నాయకులు